క్లుప్తంగా

ఉల్లిభద్రలో డ్రోన్ సర్వే



డ్రోన్ సాయంతో సర్వే చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి సమగ్ర భూసర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో డ్రోన్ ద్వారా సర్వే చేపట్టారు. జగనన్న భూరక్ష పథకంలో భాగంగా సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. శాటిలైట్ ద్వారా ఫోటోలను తీసిన తరువాత గ్రామంలోని రైతులకు నోటీసులను అందించి భూముల సరిహద్దులు నిర్ణయించడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన బలగ పోలయ్య, ఈసర్ల శ్రీరంగయ్య బుధవారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని కాలినడకన గ్రామంలోకి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన పాట్టేలు పాపారావు, కొయ్యాన దుర్గారావు ద్విచక్ర వాహనంపై వస్తూ వారిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. వారిలో పోలయ్య కాళ్లకు తీవ్రగాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. ఎస్సై బి.శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోరుముద్ద పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ జామి నారాయణస్వామి అన్నారు. మండలంలోని రేగిడి పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. నాడు–నేడు పనులు, మధ్యాహ్న భోజనాలను తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

గరిష్ట వేతనం పొందేలా చూడాలి



మాట్లాడుతున్న ఏపీఓ తులసీదాస్

భామిని: మండల కేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీఓ తులసీదాస్ అధ్యక్షతన క్షేత్రస్థాయి సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. ఉపాధి పనులకు వచ్చే వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. మస్టర్ల నమోదులో పారదర్శకత పాటించాలని, వేతనదారులకు గరిష్ట వేతనం లభించేలా కొలతలు ఇచ్చి వారితో రెండు పూటలా పనులు చేయించాలని సూచించారు. వేతనదారుల ఆధార్ నంబరును ఎన్ఎంఎంఎస్ యాప్‌తో అనుసంధానం చేయించాలన్నారు. ప్రారంభించిన పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు.

సచివాలయాల సందర్శన



అర్దలి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. బుధవారం పాలకొండ మండలం అర్దలి, ఎల్.ఎల్.పురం సచివాలయాలను సందర్శించారు. అక్కడి రికార్డుల నిర్వహణ, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. సచివాలయం పరిధిలో ప్రతీ అంశాలన్ని పరిగణలోకి తీసుకుని వాటి సంపూర్ణ సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు.

సమష్టిగా పనిచేద్దాం..
పార్టీని గెలిపించుకుందాం

- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మనమంతా కష్టపడి పనిచేసి పార్టీని మరోసారి గెలిపించుకుందామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. చినమేరంగిలోని ప్రతాపరుద్ర కాలనీలో బుధవారం వైఎస్సార్‌సీపీ గృహసారథులతో సమావేశం నిర్వహించారు. 50 కుటుంబాలకు ఒకరు చొప్పున గృహసారథులను నియమించడం జరిగిందన్నారు. వారంతా ఆయా కుటుంబాలకు వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సమష్టిగా పనిచేసి పార్టీని గెలిపించుకుందామని, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతీ ఇంటికి చేరేలా గృహసారథులు, వలంటీర్లు పనిచేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ధీటుగా ఎదుర్కోవడంతో పాటు వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ కార్యకర్తల వల్లే పార్టీ గెలుపొందిందని, అటువంటి కార్యకర్తలను పార్టీ ఎప్పటికీ మరువదన్నారు. కార్యకర్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి అవసరాన్ని గుర్తించి గృహసారథులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, సచివాలయ కన్వీనర్ పల్ల అనంతనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, చినమేరంగి కోఆపరేటివ్ అధ్యక్షుడు తాడేల మన్మథనాయుడు, చినమేరంగి సర్పంచ్ అల్లు రవణమ్మ, ఎంపీటీసీ మజ్జి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

నేడు గృహసారథులతో సమావేశం

కొమరాడ: మండల కేంద్రం కొమరాడలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు డి.జనార్దనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పాల్గొంటారని పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు



పోలీసుల అదుపులో ముద్దాయి

గరుగుబిల్లి: సారా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. కొత్తూరు గ్రామ సమీపంలో బొత్స బలరాం అనే వ్యక్తి సారా ప్యాకెట్లు తీసుకుని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద 103 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. అతనిపై గతంలో కూడా రెండు కేసులు నమోదైనట్లు చెప్పారు. ముద్దాయిని పార్వతీపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

పక్కాగా లిప్ ప్రోగ్రాం అమలు



పాలకొండ: మంగళాపురం పాఠశాలను సందర్శించిన స్టేట్ బృందం



వీరఘట్టం: తలవరం హైస్కూల్‌లో లిప్ ప్రోగ్రాం స్టేట్ పరిశీలకుడు జయకృష్ణ, ఎంఈఓ కృష్ణమూర్తి

వీరఘట్టం: విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న లాంగ్వేజ్ లెర్నింగ్ ప్రోగ్రాం(లిప్)ను పక్కాగా అమలు చేయాలని ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకుడు ఎస్.జయకృష్ణ అన్నారు. మండలంలోని తలవరం, వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో లిప్ ప్రోగ్రాం అమలును ఎంఈఓ పర్రి కృష్ణమూర్తితో కలిసి బుధవారం పరిశీలించారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని ఏ–గ్రేడ్‌కు తీసుకురావాలని సూచించారు. వారితో పాటు ఎస్ఆర్పీ ఎం.రామకృష్ణ, తలవరం హెచ్ఎం ఉప్పాడ అప్పారావు, వీరఘట్టం బాలికోన్నత పాఠశాల హెచ్ఎం దూసి నాగమణి ఉన్నారు.

– పాలకొండ: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్రసాయి బృందం బుధవారం పరిశీలించిందని ఎంఈఓ సూర్యనారాయణ తెలిపారు. లిప్ ప్రోగ్రాం అమలులో భాగంగా స్టేట్ రిసోర్స్ పర్సన్లు జయకృష్ణ, రామకృష్ణ తదితరులు తంపటాపల్లి, మంగళాపురం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించినట్లు చెప్పారు. పాఠశాలల్లో లిప్ ప్రోగ్రాం అమలుపై సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని తోటపల్లి పంచాయతీ నందివానివలస ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహణ, మెనూ అమలుపై, భోజనాల నాణ్యతపై ఆరా తీశారు.

ఫైలేరియా నివారణే లక్ష్యం



జియ్యమ్మవలస: విద్యార్థులకు డీఈసీ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బోదవ్యాధి నివారణకు డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రమేష్ విద్యార్థులకు బుధవారం డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లోనూ వలంటీర్ల ద్వారా ఇంటింటికీ ఈ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 2–5 సంవత్సరాల లోపు పిల్లలు ఒక మాత్ర, 6–14 సంవత్సరాల లోపు పిల్లలు రెండు మాత్రలు, 15 సంవత్సరాలు పైబడిన వారు మూడు మాత్రలు వేసుకోవాలన్నారు. ఏదైనా ఆహారం తీసుకున్న తరువాత మాత్రమే వీటిని వేసుకోవాలని సూచించారు. వాటితో పాటు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 1–2 సంవత్సరాలలోపు పిల్లలు అరముక్క, రెండు సంవత్సరాల పైబడినవారు ఒక మాత్ర వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం: బోదవ్యాధి, రక్తహీనత నియంత్రణే లక్ష్యంగా డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ వీవీ శివరామప్ప తెలిపారు. రావాడ–రామభద్రపురం పీహెచ్‌సీ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి ఈ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.శ్రావణ్‌కుమార్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం రామగోవింద, ఏటీడబ్ల్యూఓ చంద్రబాబు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: తాడికొండ పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు బుధవారం పంపిణీ చేశారు. వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు, పి.అభిలాష్ మాట్లాడుతూ.. ఫైలేరియా, నులిపురుగులను నివారించేందుకు ఈ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 104 అంబులెన్స్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఆరోగ్య కార్యకర్త ఎస్.రత్నప్రసాద్, ఏఎన్ఎం కాంచన ఆశా వర్కర్లు ఉన్నారు.

గరుగుబిల్లి: ఫైలేరియా వ్యాధి నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. బుధవారం గరుగుబిల్లిలోని పాఠశాలలో విద్యార్థులకు డీఈసీ మాత్రలు, ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులుపురుగులు, ఏలిక పాముల నివారణకు ఈ మాత్రలు ఉపయోగపడతాయన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఈ మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు.



కురుపాం: విద్యార్థులతో డీఈసీ మాత్రలు మింగిస్తున్న ఎంపీడీఓ శివరామప్ప



గరుగుబిల్లి: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

ఎంఎల్‌సీ స్టాక్ పాయింట్ తనిఖీ



సరుకుల నిల్వలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సింహాచలం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఎం.ఎల్.సి స్టాక్ పాయింట్ ప్రధాన గోదాంను శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, పర్యవేక్షణ కార్యాలయం ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకుల నిల్వలు, రికార్డుల్లో ఉన్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలు, వసతిగృహాలు, రేషన్ డిపోలకు తరలించిన బియ్యం స్టాకు వివరాలను గోదాం ఇన్‌చార్జి ఎం.సాంబశివరావును అడిగి తెలుసుకున్నారు. రికార్డులన్నీ పక్కాగా ఉండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు



వేతనదారుల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు బోగస్ మస్టర్లు వేస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ జి.పైడితల్లి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో చేపడుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి మస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. వేతనదారుల మస్టర్లను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆమె వెంట ఏపీఓ టి.రామకృష్ణనాయుడు ఉన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న చంద్రశేఖర్

భామిని: రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బాలేరు ఎంపీటీసీ, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. సొలికిరి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

నేటి నుంచి మల్లికార్జున స్వామి ఉత్సవాలు



ముస్తాబైన మల్లికార్జునస్వామి ఆలయం

భామిని: మండల కేంద్రంలో వెలసిన ఉమా సహిత మల్లికార్జునస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు నేటి నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న పీఆర్ ఈఈ రాధారాణి

జియ్యమ్మవలస: 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారం, చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై పంచాయతీ రాజ్ ఈఈ రాధారాణి బుధవారం సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రమేష్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మొత్తం 86 పనులను గుర్తించగా..19 పనులకు నామినేషన్లు వచ్చాయని, 67 పనులకు నామినేషన్ దాఖలు లేవని తెలిపారు. నామినేషన్ స్వీకరించి ప్రతిపాదనలు పంపించాలని కోరారు. జిల్లాకు రూ.19 కోట్లు నిధులు వచ్చాయని, బిల్లుల చెల్లింపులో ఎటువంటి జాప్యం జరగదని ఎంపీడీఓ రమేష్ కాంట్రాక్టర్లకు సూచించారు. సమావేశంలో పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ సాయి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణ మహోత్సవం

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురంలో సీతారాముల కల్యాణ వార్షికోత్సవాలు మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం ఉత్సవమూర్తులకు చక్రతీర్థ స్నానం చేయించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదుల రామచంద్రరావు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

పరిశోధనలతోనే మెరుగైన ఫలితాలు



విజ్ఞాన యాత్రకు బయలుదేరి వెళ్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: పరిశోధనలతోనే మెరుగైన ఫలితాలను సాధించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న 60 మంది విద్యార్థులను బుధవారం ఫీల్డ్ విజిట్‌కు తీసుకువెళ్లారు. ఈ నెల 15 నుంచి 26 వరకు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని ఉద్యాన పరిశోధన కేంద్రాలను సందర్శించనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్‌గా నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు సబ్జెక్టుపై పూర్తిస్థాయి స్పష్టత వస్తుందన్నారు.

గిట్టుబాటు ధర చెల్లించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు గంగాధర్

సీతంపేట: ఈనెల 20న గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ జీసీసీ బ్రాంచ్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ఆ సంఘం నాయకులు ఎ.గంగాధర్ తెలిపారు. బుధవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీఉత్పత్తులకు బయట మార్కెట్ కంటే తక్కువ మద్దతు ధరలు ప్రకటించడం అన్యాయమన్నారు. చింతపండు కిలో రూ.50, పసుపు రూ.100, గ్రేడ్ వన్ కొండచీపురు రూ.65 ఇలా ధరలు పెంచి కొనుగోలు చేయాలన్నారు. లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు జె.శ్రీరాములు, కైలాస్, సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపై అవగాహన



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ డి.త్రినాథులు అన్నారు. మండలంలోని అన్నవరం పీహెచ్‌సీలో వైద్యాధికారి వేములకొండ కమల్‌నాథ్ నేతృత్వంలో ఆరోగ్య సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ వ్యాధుల నివారణకు కృషిచేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్, ఎన్‌సీడీసీడీ, ఎస్‌జీడీ సర్వేలు సక్రమంగా పూర్తిచేయాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సూచనలు, సలహాలు అందిస్తూ వారిని చైతన్యపర్చాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



చిన్నకోటిపల్లిలో సీసీరోడ్డు నిర్మాణ పనులు

పాలకొండ రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కోటిపల్లి సర్పంచ్ సింగంవలస మంగామణి అన్నారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్యలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. సమస్యలపై వెంటనే స్పందించిన వారు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో రహదారి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మెరుగైన సేవలందించాలి: సబ్‌కలెక్టర్



సమీక్ష నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్

పాలకొండ: రెవెన్యూ డివిజన్ కేంద్రంలో సేవలు మితగా మండలాలకు ఆదర్శంగా ఉండాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వీఆర్వోలతో రెవెన్యూ సేవలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా అందుతున్న రెవెన్యూ సేవలపై సమీక్షించారు. ఈకేవైసీ, జాయింట్ అజమాయిషీ, సమగ్ర భూ సర్వే, ప్రభుత్వ భూముల రక్షణ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనితీరు మరింత మెరుగుపరచుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా పనిచేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్ కేంద్రంలోనే సేవలు సక్రమంగా లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఆయనతో పాటుగా తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, టీడీలు బుచ్చయ్య, సన్యాసిరావు, ఆర్ఐ పుష్ప ఉన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

భామిని: గ్రామ సచివాలయాల్లో పూర్తిస్థాయిలో పౌరసేవలు అందించాలని డీఎల్‌డీఓ వీవీ గోపాలకృష్ణ అన్నారు. బాలేరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సచివాలయంలో అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చెప్పిన 560 సేవల్లో కనీసం 60 సేవలు కూడా అందజేయడం లేదని గుర్తించి పనితీరు మెరుగుపర్చుకోవాలని సిబ్బందిని మందలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, కార్యదర్శి సత్యవతి, వీఆర్వో వెంకటరమణ, డబ్ల్యూఏ ప్రవళిక, వలంటీర్లు ఉన్నారు.

పాడిపశువుల సంక్షేమానికి కృషి

వీరఘట్టం: రానున్న వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వీరఘట్టం పశు వైద్యాధికారి సీహెచ్.చైతన్యశంకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..మండల వ్యాప్తంగా వెయ్యి కిలోల గడ్డి విత్తనాలను 77 శాతం సబ్సిడీపై యూనిట్(5 కిలోలు) రూ.109ల చొప్పున రైతులకు అందజేసినట్లు చెప్పారు. పాల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు 12 చోట్ల స్థల సేకరణ చేసి రైతులకు అప్పగించామన్నారు. పశువులు, గొర్రెలకు చర్మ వ్యాధులు, గర్భకోశ సంబంధిత, ఇతర వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం సమకూర్చిన అత్యవసర వాహనం ద్వారా ఊరూరా సంచార పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు.